




నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

కర్నూలు నంద్యాల

శనివారం | 28 జూన్ 2025

పేజీలు 8


### కమీషనర్ గారూ..!
# మీకిది తగునా..!

- ఏసీపీకి తీరని అవమానం
- విధి నిర్వహణలో వాహనం దింపిన ఘటన
- చైన్‌మెన్ టూవీలర్‌లో విధులకు హాజరు..



కమీషనర్ శేషన్న

నంద్యాల మున్సిపాలిటీలో అంతర్భాగమైన పట్టణ ప్రణాళికా విభాగం అధిపతికి తీరని అవమానం జరిగింది. విధి నిర్వహణలో ఉండగా అధిపతిని వాహనం నుంచి దించేశారు. తన విభాగంలో చైన్‌మెన్‌గా పని చేస్తున్న ఒకరి టూవీలర్ వాహనంలో అధిపతి విధులకు హాజరయ్యారు. మున్సిపల్ కమీషనర్ శేషన్న తీరుపై మున్సిపల్ వర్గాలు భగ్గుమంటున్నాయి. మున్సిపాలిటీ లకు ప్రధాన ఆదాయ వనరులను అందించే పట్టణ ప్రణాళికా విభాగం ముఖ్య అధికారి పట్ల ఆయన వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కమీషనర్ గారూ మీకిది తగునా అంటూ పట్టణ ప్రణాళి కా విభాగంలో తీవ్ర చర్చ జరుగుతున్న నేపథ్యంలో మేజర్ న్యూస్ అందిస్తున్న కథనం ఇది..

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** నంద్యాల మున్సిపల్ కమీషనర్‌గా శేషన్న బాధ్యతలు



ఏసీపీ నరసింహ మూర్తి

చేపట్టిన తరువాత నంద్యాల మున్సిపాలిటీలో పాలనపై దృష్టి పెట్టారు. ప్రతీ విభాగం అధిపతులను పిలిపించుకొని నంద్యాల మున్సిపల్ అభివృద్ధిపై తన ఆలోచనలను స్పష్టం చేస్తున్నారు. మున్సిపాలిటీలో కీలకమైన పట్టణ ప్రణాళికా మిగతా 2లో

**హొళగుంద,మేజర్‌న్యూస్:** కర్ణాటక విజయనగర (హోస్పేట్) జిల్లా కేంద్రంలో ఉన్న తుంగభద్ర జలాశయం నుండి జూలై 10వ తేదిన గురు పౌర్ణమి రోజున కర్ణాటక కోటా కింద దిగువ కాలువకు నీటిని విడుదల చేస్తున్న తీర్మానం చేశారు.కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నగరంలోని విధానసౌధలో శుక్రవారం కొప్పళ జిల్లాకు చెందిన మంత్రి శివరాజ్ తంగడిగ అధ్యక్షతన నీటి సలహా సమితి సమావేం నిర్వహించారు.సమావేశానికి కర్ణాటక లోకసభ సభ్యులు, శాసనసభ్యులు, చీఫ్ ఇంజినిర్,రైతు సంఘం సభ్యులు, అధికార వర్గాలు హజరైయ్యారు. జలాశయంలో నీటి లెక్కల ప్రకారంగా చర్చించి జూలై 10వ తేదిన కర్ణాటక కోటా కింద ఖరీఫ్ సీజన్‌కు హెచ్ఎల్‌సీ,ఎల్ఎల్‌సీ కాలువలకు నీటిని విడుదల చేస్తున్నట్లు తీర్మానం చేశారు.ఎల్ఎల్‌సీ కాలువకు 500 క్యూసేక్సల ప్రకారంగా నెల రోజుల పాటు,ఆగస్టు 1వ తేది నుండి నవంబర్ 30వ తేది వరకు 650 క్యూసేక్సల నీటిని పోడగిస్తూ సరఫరా చేస్తున్నట్లు తీర్మానం చేశారు.ఆదేవిధంగా జూలై 2వ తేది నుండి రాయచూరు ఎల్‌బిఎంసి కాలువకు నీటిని విడుదల చేస్తారు. రెండో పంట రబీ సీజన్‌కు నీటిని సరఫరా చేసే విషయం, మిగతా 2లో

### జూలై 10న తుంగభద్ర దిగువ కాలువకు
# నీరు విడుదల

- బెంగళూరులో జరిగిన ఐసిసి సమావేశంలో తీర్మానం
- జలాశయంలో 58 టీఎంసీలకు చేరిన నీటి సామర్థ్యం..
- 45 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో డ్యాం గేట్ల భద్రత పై త్వరలో సమావేశం



తుంగభద్ర జలాశయంలో జలకళ



బనగానపల్లెలో కొలువుదీరిన పీర్లు

# మొహర్రం వేడుకలు ప్రారంభం

- ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి

**బనగానపల్లెమేజర్,న్యూస్:** బనగానపల్లె పట్టణంలో మొహర్రం వేడుకలు ప్రభుత్వ లాంఛనాలతో ఘనంగా ప్రారంభమైంది. గురువారం రాత్రి పట్టణంలోని ఆస్థానంలో బంగారు పీర్లను నిలిపారు. బనగానపల్లె పట్టణంలో మొహర్రం వేడుకలకు గాను జిల్లా మైనార్టీ శాఖా నుంచి 10లక్షల రూపాయలు నిధులు కేటాయించడంపై ముస్లీం మైనార్టీ సోదరులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి క్యాంపు కార్యాలయం నుండి ఆస్థానం వరకు మైనార్టీ సోదరులతో కలిసి పాదయాత్రగా వెళ్లి నవాబు ఆహ్వానం మేరకు పూలదట్టీలను మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి మిగతా 2లో

# ఆధార్ కేంద్రం లేక ప్రజల అవస్థలు

- ఆధార్ అవస్థలు అన్నీ ఇన్నీ కావంటున్న బాధితులు
- ప్రస్తుతం ఏ పని కావాలన్నా ఆధార్ తప్పనిసరి
- ఆధార్ లేకపోతే పని జరగడం కష్టం..

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్:** ఆధార్ అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ప్రస్తుతం ఏ పని కావాలన్నా ఆధార్ ఉండాల్సిందే. అది లేకపోతే పని జరగడం లేదు. పోనీ ఆధార్ చేయించుకుందామంటే ఆ అవకాశం లేదు. ఎందుకంటే ఎక్కడికక్కడ ఆధార్ కేంద్రాలు మూతపడిపోయాయి. దీంతో

AADHAAR

ఆధార్ చేర్పులు,మార్పులలకు జనాలు అష్ట కష్టాలు పడుతున్నారు.దిక్కుతోచక దీనంగా తిరుగుతున్నారు. మిగతా 2లో

### ఎస్సీ,ఎస్టీ కేసులో జయంతి వెంకటేశ్వర్లు
# అరెస్టు,రిమాండ్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మాజీ అధ్యక్షులు జయంతి వెంకటేశ్వర్లును ఎస్‌సి,ఎస్‌టి కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని 1 టౌన్ పరిధిలోనివాసముంటున్న జయంతి వెంకటేశ్వర్లు షరాఫ్ బజార్ ప్రాంతంలో చీటీలు వేస్తూ ఉండేవాడు. మిగతా 6లో



జయంతి వెంకటేశ్వర్లును జైలుకు తరలించిన పోలీసులు

# ప్రభుత్వ ఉద్యోగితో జరభద్రం..!

- చేసే పనిని చెప్పను..నేను ఎవ్వరికీ సమాధానం ఇవ్వను..!
- దిక్కున్న చోట చెప్పుకోమంటున్న ఎన్‌సిడి ఎన్‌టిఆర్ భరోసా ప్రభుత్వ ఉద్యోగి
- విధుల పట్ల నిర్లక్ష్యం తగునా..ఇష్టానుసారంగా విధులకు..!
- ప్రజలంటే చిన్నచూపా..సమాధానం కొరకు పైకి రాకూడదా..?
- ప్రశ్నించే విలేకరులను బ్లాక్‌మెయిల్ చేస్తానన్న ఉద్యోగి
- ఎస్‌సి కులం అనే పేరుతో కేసు పెడతానని అన్నాడని అబద్ధం చెబుతాను
- ఈ మాటలకు వాడి దగ్గర అధారాలు ,రికార్డు ఉండదని తోటి అధికారులతో చర్చించిన ప్రభుత్వ ఉద్యోగి
- పని నిమిత్తం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనుమతితోనే ఉద్యోగి వద్దకు రావాలంటా..!!
- అధికారం దుర్వినియోగం చేస్తున్న అధికారి
- ఇది డిఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయం నందు ఓ ఉద్యోగి ప్రవర్తన

2లో




జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం

## జూలై 10 న తుంగభద్ర దిగువ కాలువకు నీరు విడుదల

(మొదటి పేజి తరువాయి)



బెంగళూరు విధానసౌధలో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

తుంగభద్ర డ్యాం గేట్ల భద్రతపై జూలై మూడవ వారంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య,ఉప ముఖ్యమంత్రి డికే శివకుమార్‌లతో సమావేశం నిర్వహించనున్నారు.జరిగిన సమావేశంలో కర్ణాటక దరూరు గ్రామానికి చెందిన నీటి సంఘం నాయకుడు పురుషోత్తంగౌడ ప్రసంగించారు.జలాశయానికి ముందుగా వరద నీరు చేరడంతో సంతోషంగా ఉందన్నారు.డ్యాంగేట్ల భద్రత గురించి,రెండో పంటలకు సాగునీటిని అందించాలని ఆయన మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.ఇదిలా ఉండగా తుంగబద్ర జలాశయంలో శుక్రవారం కెపాసిటి 105.788 టీఎంసీలకు గాను 58 టీఎంసీల నీటి సామర్థ్యం నిల్వ ఉంది.1633 అడుగుల పూర్తి నీటిమట్టం గాను 1619 అడుగులకు చెరింది.జలాశయం ఎగువ ప్రాంతంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ఇన్‌ఫ్లో 45 వేల క్యూసెక్కుల వరద నీరు చేరుతుంది.కాలువలకు నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రకటించడంతో రైతన్నల ఆశలు చిగిరించాయి.ముఖ్యంగా కర్నూల్ జిల్లా పశ్చిమ ప్రాంతాల రైతులు,ప్రజలు నీటి కోసం ఎదురు చూపులు చూస్తున్నారు.దిగువ కాలుకు నీరు చేరితే వెలాది ఎకరాలకు సాగు నీరు వందల గ్రామాల ప్రజలకు తాగు నీరు అందుతుంది.

## మొహర్రం వేడుకలు ప్రారంభం

(మొదటి పేజి తరువాయి)

సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని నవాబ్ వారసుడు జనాబ్ మీర్ ఫజల్ అలీఖాన్ బంగారు పీర్లకు దట్టీలు కట్టి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ముస్లీం సోదరులతో కలిసి మంత్రి బి.సి ప్రత్యేక ఫాతేహాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తరపున మొహర్రం పండుగకు 10లక్షల రూపాయలు మంజూరు చేయడంలో చంద్రబాబునాయుడుఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి సాధ్యమైందని భవిష్యత్తులో కూడా ప్రతి ఏటా మొహర్రానికి నిధులు మంజూరు చేయిస్తామని హామి ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి, మంత్రి ఫరూక్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



మొహర్రం వేడుకల్లో మంత్రి బి.సి

## కమీషనర్ గారూ..! మీకిది తగునా..!

(మొదటి పేజి తరువాయి)

విభాగానికి సంబంధించిన కీలక దస్త్రాల పరిశీలనకు ప్రతీ వారంలో శుక్రవారం కేటాయించారు. అందులో భాగంగా శుక్రవారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో కమీషనర్ శేషన్న, ఏసీపీ మూర్తి, టీపీఎస్‌లు నాయక్, రిజ్వానాలు ఒక బృందంగా కీలక దస్త్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్ళారు. ముందుగా పాత పట్టణంలో భాగమైన నబీనగర్ వరకు కమీషనర్ వాహనంలో ఏసీపీ కూర్చున్నారు. టీపీఎస్ రిజ్వానా తన టూవీలర్‌లో మరో టీపీఎస్ నాయక్ చైన్‌మెన్ వాహనంలో అక్కడికి వెళ్ళారు. అక్కడ కీలక దస్త్రాల్లో ఒక దానిని పరిశీలించిన తరువాత కమీషనర్ తన వాహనంలోకి ఎక్కారు. అదే వాహనంలోకి ఏసీపీ నరసింహ మూర్తి ఎక్కుతుండగా టీపీఎస్ నాయక్ ఆరోగ్యం సరిగ్గా లేదని చెబుతూ తన వాహనంలో ఎక్కించుకున్నారు. ఏసీపీని అక్కడే దించి వేయడంతో ఆయన విధులకు హాజరైన చైన్‌మెన్ టూవీలర్ వాహనంలో ఎక్కి విధులకు హాజరయ్యారు. కీలక దస్త్రాలలో డీపీఎస్, రోడ్ వైండింగ్, ఆర్‌డీపీ, బీఆర్‌ఎస్, ఎల్‌ఆర్‌ఎస్ దస్త్రాలు సుమారు 40కిపైగా ఉన్నట్లు తెలుస్తోంది. అందులో సుమారు 11 దస్త్రాలను పరిశీలనలో భాగంగా నడిగడ్డ, నబీనగర్, ఫరూక్‌నగర్, పద్మావతినగర్, సూరజ్ హోటల్ ప్రాంతాలలో దస్త్రాలకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. మొదటగా వెళ్లిన నబీనగర్ తరువాత ఏసీపీ నరసింహ మూర్తి మిగిలిన ప్రాంతాలకు చైన్‌మెన్ టూవీలర్ వాహనంలోనే విధులకు హాజరయ్యారు. సీనియర్ ఏసీపీ అయిన నరసింహ మూర్తిని వాహనం నుంచి దించిన తరువాత తిరిగి ఎక్కించుకోకపోవడంపై పట్టణ ప్రణాళికా విభాగంలో తీవ్ర నిరసన గళం వినిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే గతంలో ఆ విభాగానికి ఉన్న వాహన సౌకర్యాన్ని గత మున్సిపాలిటీ ఉన్నతాధికారులు తొలగించడంతో టూవీలర్ వాహనాలలోనే క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్తున్నారు. రోజు రోజుకు విస్తరిస్తున్న నంద్యాల మున్సిపాలిటీ శివారు ప్రాంతాలైన పొన్నాపురం, రైతునగరం, ఊడుమాల్పురం, తదితర ప్రాంతాలలో సొంత వాహనాల్లోనే విధులకు వెళ్తున్నారు. గజిటెడ్ హోదా కలిగిన ఏసీపీని వాహనంలోఎక్కించుకోకుండా అదే విభాగంలో ఆయన కింద పని చేస్తున్న టీపీఎస్ నాయక్‌ను ఆరోగ్యం సరిగ్గా లేదని చెబుతూ ఎక్కించుకోవడంపై ఆ విభాగంలో చర్చకు దారి తీసింది. కమీషనర్ వాహనంలో వెనుక సీటులో ఇద్దరు కూర్చునేందుకు అవకాశం ఉన్నా ఏసీపీని ఎక్కించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## ఆధార్ కేంద్రం లేక ప్రజల అవస్థలు


(మొదటి పేజి తరువాయి)

వెల్దుర్తి మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రాలు లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు అందుకోవాలంటే ఆధార్ తప్పనిసరి. మరి ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఆధార్ నమోదు సెంటర్ కర్నూలు జిల్లా, వెల్దుర్తి మండల కేంద్రంలో గత మూడు నెలల నుండి మూతపడి ఉండడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రేషన్‌బియ్యం తీసుకోవాలంటే ప్రతి ఒక్కరు ఆధార్ కలిగి ఉండి రేషన్‌కార్డుకి ఆధార్ లింక్ చేసుకొని ఉండాలని కేంద్రప్రభుత్వం సూచించిన నేపథ్యంలో, మండలంలోని పలు రేషన్ సెంటర్లలో వృద్దులకు, చిన్నపిల్లలకు వేలిముద్రలు పడకపోవడంతో రేషన్‌షాప్‌దారులు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని సూచిస్తున్నారు. వెల్దుర్తి పరిధిలోని ఆధార్ నిర్వహకులపై ఆరోపణలు రావడంతో ఆధార్ కేంద్రాలు పని చేయడంలేదని, దీంతో ఆధార్ సెంటర్లు పనిచేయకపోవడంతో దూర ప్రాంతాల్లో ఉన్నటువంటి గ్రామాల్లో ఆధార్ సెంటర్లకు వెళ్ళాల్సి వస్తుందని, వెళ్ళినా అక్కడ పనిచేయడం లేదంటూ దూర ప్రాంతాలు కావడంతో కూలి పనులు మానుకొని వెళ్లాల్సి వస్తుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మంత్రి బి.సి సహకారంతో ఐఐటిలో సీటు సాధించిన షబరీష్

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సహకారంతో విద్యార్థి అరవేటి శబరీష్ ఐఐటి బాంబేలో సీటు సాధించారు. నంద్యాల పట్టణానికి చెందిన అరవేటి కృష్ణ మూర్తి, పుష్పావతీల కుమారుడు అరవేటి శబరి జెఈఈ అడ్వాన్స్‌లో దివ్యాంగుల కోటాలో ఆలిండియా 3వ ర్యాంకు సాధించాడు కానీ ఇంటర్‌లో 5 సబ్జెక్టులకుగాను అతడి శారీరక పరిస్థితిని గమనించిన ఇంటర్ అకాడమీ 4 సబ్జెక్టులు చదివేందుకు ప్రత్యేక అనుమతిని ఇచ్చింది. అయితే ఐఐటి ర్యాంకు వచ్చినా 5 సబ్జెక్టులు చదవలేదన్న కారణంతో సీటు ఇచ్చేందుకు ఐఐటి బోర్డు నిరాకరించింది. ఈ విషయాన్ని షబరీష్ తల్లిదండ్రులు మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర ప్రభుత్వం తరపున సంప్రదింపులు జరపడంతో ఎట్టకేలకు షబరీష్ ఐఐటి బాంబేలో సీటు సాధించాడు. దీంతో శుక్రవారంనాడు శబరీష్ అతడి తల్లిదండ్రులు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో బి.సి జనార్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలను తెలిపారు.



విద్యార్థికి అభినందనలు తెల్పుతున్న మంత్రి బి.సి

## ప్రభుత్వ ఉద్యోగితో జరభద్రం..!

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల కోసం పని చేస్తున్నామని వారికి ఏ కష్టం రాకుండా సర్వీసెస్ ఇస్తూ నీతి నిజాయితీలతో విధులు నిర్వహిస్తున్నామని స్పీచ్‌లు ఇస్తుంటారు. ప్రజల వలనే ప్రభుత్వ ఉద్యోగులు జీతాలు తీసుకుంటున్నాం వారే మా యజమానులు అని ప్రసంగాలు మాత్రం కోకొల్లలుగా చెబుతుంటారు. కర్నూలు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు పెద్ద కార్యాలయమైన నగరంలోని డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం నందు కొందరు ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ప్రజలను, పాత్రికేయులను పురుగుల్లా చూస్తున్నారు. ఈ ఆఫీసుకు ఏ పని కోసం వచ్చిన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ను కలిసి పరిమిషన్ తీసుకున్న తరువాతే ఎవరైనా పైకి వచ్చి పని చూసుకోవాలంట. ఈ నిబంధన ఉల్లంఘించి వచ్చిన ప్రజలు లేదా ఎవరైనా సమాచారం కోసం వస్తే నేను చేసే పనిని చెప్పను..అది పాత్రికేయుడైతే నాకేమీ ఎవరైనా నా సమాధానం ఒక్కటేనని..నిర్లక్ష్యంగా వాదిస్తున్న ఎన్‌సిడి ఎన్‌టిఆర్ భరోసా విభాగానికి సంబంధించి అతిత్వరలో రిటైర్డ్ కాబోతున్న ఓ ప్రభుత్వ ఉద్యోగి యొక్క నిర్లక్ష్య సమాధానం. ప్రజల కోసం అనునిత్యం ప్రజల అవగాహన కోసం ప్రతి విషయంపై ఆరా తీసి వార్తల రూపంలో ప్రజలకు చేర్చే పాత్రికేయుడినే ఇంత చిన్నచూపు చూస్తుంటే సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి ప్రజలారా. ఈ ఉద్యోగి యొక్క పని తీరు, ప్రవర్తన గురించి ఆ కార్యాలయ జిల్లా అధికారికి



ప్రభుత్వ ఉద్యోగి గది

తెలుసో, తెలియదో. కార్యాలయం నందు ఉన్న కొందరు ఉద్యోగులు ఆయనకు కోపం ఎక్కువ ఆరోగ్యం బాగోలేదు పోనీ వదిలేయండి అంటున్నారు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు ప్రసంగాలలో చెప్పే మాట ఒకటి తన దాక వచ్చినప్పుడు ప్రవర్తించే విధానం మరొకలాగా ఉంటుంద నడానికి ఈ ఉద్యోగే నిదర్శనం. ఎన్‌సిడి ఎన్‌టిఆర్ ప్రభుత్వ ఉద్యోగికి అంత ఆగ్రహం మంచిది కాదని పాత్రికేయుడు ప్రశ్నించగా ఆ ఉద్యోగి నేనేంటో నీకు చూపిస్తానని బెదిరించాడు. తోటి ఉద్యోగులు సర్ది చెప్పి పంపగా పాత్రికేయుడు పక్క రూమ్‌కి వెళ్లి వస్తుండగా ఆ ఉద్యోగి మాటలు గట్టిగా మాట్లాడుతుండడం గమనించి చూద్దామని పాత్రికేయుడు డోర్ దగ్గరికి వెళ్లాడు. ఈ ప్రభుత్వ ఉద్యోగి తోటి ప్రభుత్వ ఉద్యోగులతో ఈ విషయంపై వాడు వార్త రాస్తే వాడు నన్ను బ్లాక్ మెయిల్ చేశాడని, డబ్బులు అడిగాడని, పాత్రికేయులు



కార్యాలయంలో అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

ఎక్కువ శాతం ఎస్‌సి క్యాస్ట్ వాళ్లే ఉంటారు కాబట్టి ఎస్‌సి కేసు పెడతాను అన్నాడని కంప్లైంట్ ఇస్తానని ఉద్యోగి అంటున్నాడు. నేను క్రియేట్ చేసే మాటలకు వాడి దగ్గర సాక్ష్యం ఉండదు కదా అని అత్యంత నీచమైన కన్నింగ్ బుద్ధితో బహిరంగంగా మాట్లాడుతున్నాడు. ఈ తతంగానికి సంబంధించి ప్రతీది ఎవిడెన్స్ ఉంది. ఏది ఏమైనా ఇలాంటి మనస్తత్వం ఉన్న ఈ ఉద్యోగి ఎన్‌సిడి ఎన్‌టిఆర్ భరోసా సెక్షన్‌లో ఉంచితే ప్రజలకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉంది. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి కావాల్సిన సర్వీసులను అందిస్తూ ఉండవలసిన ఈ విభాగం ఉద్యోగి ఇలాంటి ప్రవర్తనతో ఉండడం మంచిది కాదని ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు అంటున్నారు. ఈ కార్యాలయం నందు ఎంతోమంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. ఇందులో కొంతమంది సమయపాలన పాటించకుండ విధులకు ఇష్టానుసారంగా హాజరవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. పలానా అధికారి ఎక్కడున్నాడని ప్రశ్నించిన ప్రజలకు 1వ అంతస్తు పైన ఉన్నారని ఒకటవ అంతస్తుకు వెళ్లి అడుగగా కింద ఉన్నారని అటెండర్లు అంటున్నారు. కిందికి వచ్చి పైన లేరు అని అడిగితే పని మీద బయటకు వెళ్లారని సాకులు చెబుతున్నట్లు సమాచారం. ఇటువంటి నిర్లక్ష్య ధోరణి ఉన్న ప్రభుత్వ అధికారులపై కఠినమైన చర్యలు తీసుకుంటారో లేదో వేచిచూడాల్సిందే. అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌ను పాత్రికేయుడు ప్రశ్నించగా అలా అనుమతి తీసుకుని వెళ్లాలని లేదు. పనిమీద వచ్చిన ప్రజలకు ఏ పని మీద వచ్చారో ఆఫీస్‌లో ఉన్న అటెండర్‌లను అడిగి సంబంధిత డిపార్ట్‌మెంట్‌లకు వెళతారు. ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత ఎవరైనా సమాచారం తెలియని వాళ్లు సమాచారంఅడిగినప్పుడు ఓపికతో సమాధానం చెప్పాలి అన్నారు. ఇటువంటి ఉద్యోగుల ప్రవర్తన పనితీరుపై జిల్లా ఉన్నతాధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

# మండల అభివృద్ధికి అందరి సహకారం అవసరం

## – ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడపడానికి అందరి సహకారం అవసరమని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న వేళ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచాలని అన్నారు. మండలంలో జులై 5వ తేదీన మెగా పేరెంట్, టీచర్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్ హెచ్‌ఎం తెలిపారు. ఈ సమావేశంలో తల్లికి వందనం పథకం గురించి పూర్తిస్థాయిలో సమీక్ష ఉంటుందని అన్నారు. విద్యార్థుల తల్లులు, వారి వారి బ్యాంక్ ఖాతాలను యాక్టివేట్ చేసుకోవాలని అన్నారు. మండలంలో ఉన్న కేసీ కెనాల్ కాలువ మరమ్మత్తుల కోసం రూ.6.90 లక్షలకు ప్రతిపాదనలు పంపినట్లు మైనర్ ఇరిగేషన్ ఏఈఈ నూర్‌బాష తెలిపారు. మండలంలో హరివరం, పగిడపాడు, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో దాదాపు 13 కిలోమీటర్లు కాలువ ఉందని, 4 వేల ఎకరాలలో సాగు నీరు అందుతుందని అన్నారు. మండలంలో ఇప్పటి వరకు 248 మంది రైతులకు కౌలు కార్డులు అందజేసినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అంకన్న తెలిపారు. మండలంలో సర్పంచ్‌లు ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రజల్లోకి వెళ్లేలా సహకరించాలని ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ హుసేన్‌బాష కోరారు. రాబోయే భవిష్యత్తు అంతా సౌర విద్యుత్‌కే ప్రాధాన్యత ఉంటుం దని అన్నారు. సాంప్రదాయ ఇంధన వనరులు వేగంగా తరిగిపోతున్నందు వలన సౌర విద్యుత్ వాడకం ఇప్పటి నుంచే మొదలు పెట్టాలని అన్నారు. మండల పరిధిలో జూన్ 26 నుంచి జులై 10వ తేదీ వరకు నట్టల నివారణ మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉయ్యాలవాడ పశువైద్యాధికారి పుల్లయ్య తెలిపారు. దేశ వ్యాప్తంగా గొర్రెలు, మేకల పెంపకం కోసం 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం మంజూరు చేస్తుందని అన్నారు. ఇప్పటి వరకు 11 టన్నుల పశువుల దానా 50 శాతం సబ్సిడీతో మొదటి విడతగా పశుపోషణ రైతులకు అందించామని అన్నారు. 50 సెంట్ల వ్యవసాయ భూమి ఉన్న రైతులకు ఉచితంగా గడ్డి పెంపకం పథకాన్ని వర్తింప జేస్తామని అన్నారు. ఉయ్యాలవాడలోని పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుందని, దానిని మరమ్మత్తులు చేయించాలని సభ దృష్టికి తెచ్చారు. ఇందుకు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు స్పందిస్తూ మండల ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకెళ్ళి సమస్య పరిష్కరిస్తామని అన్నారు. పొదుపు సంఘంలో ఉన్న ప్రతి ఒక్క సభ్యురాలు డిజిటల్ వేలిముద్రలను తప్పని సరిగా వేయాలని వెలుగు సీసీ గంగన్న తెలిపారు. 6 నెలలు పూర్తైన అంగన్‌వాడీ పిల్లలందరికీ ఆధార్ కార్డు తప్పని సరి అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ తెలిపారు. మండలంలో అల్లూరు, మాయలూరు, తుడుములదిన్నె గ్రామ సచివాలయాల్లో నిరంతర ఆధార్ కేంద్రాలు పని చేస్తున్నాయని, ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలనుకున్న వారు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు. మండలంలో ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.3 కోట్లతో ఉపాధి పనులు చేయిస్తున్నామని ఏపీవో హరికృష్ణ తెలిపారు. 1.60 లక్షల పని దినాలు లక్ష్యంగా నిర్ణయించామని అన్నారు. స్మశానవాటికల అభివృద్ధి కోసం ప్రతి గ్రామానికి రూ.17 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు అమీర్ అహమ్మద్, ఇతర మండల స్థాయి అధికారులందరూ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులుగా అమానుల్లా



అమానుల్లాకు నియామక పత్రం అందచేస్తున్న నాయకులు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ ఉపాధ్యక్షులుగా పగిడాల అమానుల్లా నియమితులయ్యారు. ఏపి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు శాలిదాదా గాంధీ అమానుల్లాను రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులుగా నియమించారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు అమానుల్లాకు నియామక పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా సుధాకర్ బాబు మాట్లాడుతూ యువకుడు న్యాయవాదిగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తున్న పగిడాల అమానుల్లాను ఏపి మైనార్టీ సెల్ డిపార్ట్‌మెంట్ ప్రధాన కార్యదర్శిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీకి కావాల్సింది యువ సైనికులు అని అన్నారు. అమానుల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అమానుల్లా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడితే కచ్చితంగా ఫలితం దక్కుతుందన్నారు. తనను రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులుగా నియమించినందుకు ఏపి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డికి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు శాలిదాదా గాంధీ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మైనార్టీల మీద చిన్నచూపు చూస్తుందని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అమానుల్లా అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐఎన్‌టియుసి ఫెడరేషన్ అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి పాషా, జిల్లా ఎస్‌సి సెల్ చైర్మన్ బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, కెకెసి జిల్లా చైర్మన్ ఎజాస్ అహ్మద్, డిసిసి మాజీ కార్యదర్శి అబ్దుల్ హై తదితరులు పాల్గొన్నారు.

# సంజామలలో కెనరా బ్యాంకు బ్రాంచ్ ప్రారంభం



కెనరా బ్యాంకును ప్రారంభిస్తున్న జనరల్ మేనేజర్, సిబ్బంది

**సంజామలమేజర్,న్యూస్:** సంజామల మండల కేంద్రంలోని స్థానిక కెనరా బ్యాంకును శుక్రవారం తిరుపతి సర్కిల్ జి.ఎం మిథనాయా, కర్నూలు ఏజిఎం సుశాంత్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ తరుణ్ కుమార్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ఖాతాదారులతో జ్యోతిప్రజ్వలన చేయించారు. అనంతరం ఖాతాదారులతో ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. కెనరా బ్యాంకు అన్ని బ్యాంకుల కంటే ఖాతాదారులకే విశేష సేవలు అందిస్తుందన్నారు. మహిళల కోసం ప్రత్యేక పథకాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ బ్యాంకు ప్రారంభించడంపై జిఎం, ఏజిఎం హర్షం వ్యక్తం చేశారు. కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో అందిస్తున్న రుణాలు, భీమాలు, క్రాప్ లోన్లు తదితర సేవలను వారు ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# జీవాలలో నట్టల నివారణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించండి



సమావేశంలో మాట్లాడుతున్న బి.వి రమణయ్య

**బనగానపల్లెమేజర్,న్యూస్:** జీవాలలో అంతర పరాన్నజీవుల నిర్మూలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆళ్లగడ్డ డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ రమణయ్య సూచించారు. శుక్రవారంనాడు బనగానపల్లె పశువైద్యశాలలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 26వ తేదీ నుండి జులై 10వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బనగానపల్లె పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మారుతీ సకారం మాట్లాడుతూ పశువైద్యశాలలో కేవలం ఆడదూడలు మాత్రమే కుట్టే ఎర్ర సూదులను 150రూపాయలకే ప్రభుత్వం అందజేస్తున్నట్లు తెలిపారు. పశువైద్యులు డాక్టర్ బ్రహ్మానంద రెడ్డి, డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, డాక్టర్ రాఘవేందర్ రెడ్డి, డాక్టర్ హుసేన్, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ భారతీ దేవి, డాక్టర్ ఐశ్వరయ్య, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో ఉద్యోగులకు బదిలీలు సహజం



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి అన్నారు. ఓర్వకల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సాధారణ బదిలీలో భాగంగా శ్యామలమ్మ, రామాంజనేయులు, చంద్రశేఖర్, రాజు, భాస్కర్, షంసు న్నీసాలు బదిలీపై వెళ్లారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు చక్కగా విద్యాబుద్దులు నేర్పించి పాఠశాల క్రమశిక్షణగా నడవడానికి ఉపాధ్యాయులు కృషి చేశారని బదిలీపై వెళ్లిన పాఠశాలలో కూడా ఇదేవిధంగా పనిచేస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు ఆపన్న హస్తం సీఎం రిలీఫ్ ఫండ్

## – మంత్రి ఎన్ఎండి ఫరూక్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న మంత్రి

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** పేద ప్రజలకు ఆపన్న హస్తంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిలుస్తోందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామానికి చెందిన శీలం నిర్మలకు రూ.1.50 లక్షల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శుక్రవారం టీడీపీ కార్యాలయం (రాజ్ టాకీస్)లో మంత్రి ఫరూక్ బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు ఆపదలో ఉంటే నేనున్నాను అని ఆదుకోవడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంచి మనస్సుకు నిదర్శనమని అన్నారు. అనారోగ్య కారణాల వల్ల, ఆక్సిడెంట్స్ వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్నా, ప్రాణాల మీదకు వచ్చినప్పుడు అత్యవసరంగా ఆపరేషన్లకు కావాల్సిన డబ్బులు లేకపోవడం, వారి స్తోమతకు మించి ఖర్చు చేయాల్సి వచ్చినప్పుడు తమ దృష్టికి తీసుకొస్తే సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించి సీఎం రిలీఫ్ ఫండ్ విడుదలయ్యేలా చూస్తామని అన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రి ఫరూక్‌కు శీలం నిర్మల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దకొట్టాల గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు కొట్టాల శివనాగిరెడ్డి, ప్రేమ్ నాథ్‌రెడ్డి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేయాలి

## – వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు వంగాల భరత్‌కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న భరత్‌కుమార్ రెడ్డి

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** శ్రీశైలం జలాశయంలో నీరు 854 అడుగులు ఉండగా శుక్రవారం రోజుకు 865 అడుగులకు చేరుకుందని అయినా రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమకు నీటిని విడుదల చేయకుండా చోద్యం చూస్తుందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు వంగాల భరత్‌కుమార్ రెడ్డి అన్నారు. వెంటనే పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేయాలని అన్నారు. రాయలసీమ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జూన్ నెల మొదటి వారంలో వర్షాలు పడటంతో రైతులు పంటలు సాగు చేశారని ఆ తర్వాత వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటలను దున్ని వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గత సంవత్సరంలోనూ రైతుల పరిస్థితి ఇలానే ఉందని పొగాకు, మిర్చి రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. ఈ సంవత్సరం త్వరగా వర్షాలు రావడం రైతులు పంటలు సాగు చేయడం జరిగిందన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేయడం వల్ల కనీసం కొంత మంది రైతులకైనా ఉపయోగపడే అవకాశం ఉందని అన్నారు. రాయలసీమ రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వంను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొసికి తిరుమలేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి నాగార్జున్ రెడ్డి, మండల కన్వీనర్ తోకల కృష్ణా రెడ్డి, సిపిఐ, సిపిఎం, రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, పల్లె గోపాల్ రెడ్డి, యువ నాయకులు తరుణ్ కుమార్‌రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ బూత్‌లను సందర్శించిన తహశీల్దార్



**కల్లూరు, మేజర్‌న్యూస్ :** కల్లూరు మండలంలోని పోలింగ్ బూత్‌లను తహశీల్దార్ కె ఆంజనేయులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా నిర్మాణ ప్రక్రియలో పారదర్శకత పాటించుట కొరకు జాయింట్ కలెక్టర్, 138పాణ్యం అసెంబ్లీ నియోజకర్గం వారి ఆదేశాల మేరకు పోలింగ్ బూత్‌ను హేతుబద్దీకరణ చేసేందుకు మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్లను సందర్శించినట్లు తెలిపారు. 1200ఓటర్లు దాటిన 60పోలింగ్ స్టేషన్లను గుర్తించినట్లు తెలిపారు. వాటిలో 47పోలింగ్ బూత్‌ల ఓటర్లను పక్క పోలింగ్ బూత్‌లోకి సర్దుబాటు చేయుటకు మరియు 13పోలింగ్ బూత్‌లను కొత్తగా ఏర్పాటు చేయుట కొరకు గుర్తించినట్లు పేర్కొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పనుల పై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

### – కమీషనర్ రవీంద్రబాబు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను సమర్థవంతంగా ఉపయోగించుకుంటూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కమీషనర్ యస్ రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (యన్ క్యాప్) పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, జాప్యం చేయకుండ సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కమీషనర్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన నగరంలో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. యన్ క్యాప్ కార్యక్రమం ద్వారా సుంకేసుల రోడ్డు, మద్దూర్ నగర్, బి క్యాంపు


పనులను పరిశీలిస్తున్న కమీషనర్

పోస్ట్ ఆఫీస్ నుండి సి క్యాంపు టిటిడి కళ్యాణ మండపం వరకు బి క్యాంపు విజ్ఞాన్ మందిర్ ప్రాంతాల్లో రహదారి ఇరువైపులా ఖాళీ ప్రదేశాలపై రహదారుల నిర్మాణ పనులను కమీషనర్ పరిశీలించారు. గాయత్రీ ఎస్టేట్ కూడలి కుదింపు, కిమ్స్ ఆసుపత్రి రహదారిలో విభాగినిల్లో మొక్కలు నాటుట, సుద్దవాగు పూడికతీత పనులు పూర్తి చేయవలసిన పనులను కమీషనర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను మెరుగు పరచడానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ సతీష్‌రెడ్డి, ఇంచార్జీ ఎస్‌ఈ శేషసాయి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి, డిఈఈ గిరిరాజ్, మనోహర్ రెడ్డి, నరేష్, బిల్డింగ్ సూపర్‌వైజర్ అంజాద్ బాష, ట్రైనీ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# సర్వ నరసింహ స్వామి అభివృద్ధికి కృషి చేస్తా

- ఆగిన పనులను పరిశీలించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తా..
- శ్రీ కృష్ణదేవరాయలు హయాంలో నిర్మించిన దేవాలయం

**శిరివెళ్ల, మేజర్‌న్యూస్ :** నంద్యాల, గిద్దలూరు రహదారిలో ఉన్న సర్వ నరసింహ స్వామి దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తానని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు అభిరుచి మధు పేర్కొన్నారు. శుక్రవారం ఆర్ అండ్ బి అధికారి సుబ్బరాయుడు, ఫారెస్ట్ అధికారులతో కలిసి అభిరుచి మధు ఆలయంలో ఆగిన పనులను పరిశీలించారు. అంతకు ముందు సర్వ నరసింహ స్వామి వారిని ద ర్శించుకున్నారు. ఈ సందర్భంగా అభిరుచి మధు మాట్లాడుతూ ఈ దేవాలయం శ్రీ కృష్ణదేవరాయలు హయాంలో నిర్మించిన దేవాలయం అని అన్నారు. పూర్వకాలంలో ఈ దేవాలయంలో నిత్యం పూజలు, అన్నదానాలు జరిగేవని పెద్దలు చెప్పేవారని అన్నారు. సర్వనరసింహ స్వామి కృపాకటాక్షాలతో ఎందరో ఆనందంగా జీవిస్తున్నారని అన్నారు. కాలక్రమేనా దేవాలయం అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. అప్పట్లో కాసింత పనులు మొదలు పెట్టారు. కానీ మధ్యలోనే పనులు నిలిపివేశారని అన్నారు. సరైన సౌకర్యాలు లేకపోవడం, భక్తులు వచ్చిన పార్కింగ్, భోజన వసతి


స్వామి వారిని దర్శించుకుంటున్న అభిరుచి మధు, తదితరులు

లేకపోవడంతో భక్తులు అరకొరగా రావడంతో దేవాలయం గర్భగుడి ఒకవైపు ప్రమాద పరిస్థితికి చేరుకుందని అన్నారు. ఈ రహదారిలో ప్రయాణించే భక్తులు ఖచ్చితంగా స్వామి వారికి కొబ్బరికాయ కొట్టి దర్శించుకుంటారని అన్నారు. దేవాలయం అభివృద్ధి మధ్యలోనే ఆగిపోవడంతో అధికారులతో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు. వర్షకాలంలో ఈ దేవాలయం చుట్టుపక్కల వజ్రాల వేట కొనసాగిస్తారని అన్నారు. దేవాలయంలో అప్పటి శిల్పకళ ఇప్పటికి చెక్కుచెదరలేదని అన్నారు. దేవాలయం అభివృద్ధి కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. హిందూ దేవాలయాలు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

# కుడా నిధులతో జగన్నాథ గట్టు అభివృద్ధి

- ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- కుడా ఛైర్మెన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న కుడా చైర్మన్ సోమిశెట్టి, జెసి

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** నగరంలోని జగన్నాథ గట్టు వద్ద కుడా నిధులతో పర్యాటక పరంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు జిల్లా పర్యాటక శాఖ అధికారిని ఆదేశించారు. శుక్రవారం నగరంలోని చాణిక్యపురి కాలనీలో ఉన్న కుడా కార్యాలయంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి బోర్డు సమావేశాన్ని కుడా వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ డా.బి నవ్య నిర్వహించారు. ఈ సందర్భంగా కుడా పరిధిలో పలు గ్రామాల్లో జరిగిన పనులపై చర్చించారు. నగరంలో ఉన్న జగన్నాథ గట్టు వద్ద చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కుడా చైర్మన్ ఆదేశించారు. అలాగే మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు పోలీస్ శాఖకు డ్రోన్‌ల మంజూరుకు బోర్డు ప్రతిపాదించడం జరిగిందన్నారు. సమావేశంలో ఏపిఎస్‌పిడిసిఎల్ ఎస్‌ఈ ఉమాపతి, జిల్లా పర్యాటక శాఖ అధికారి విజయ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్ రె డ్డి, డిటిసి శాంత కుమారి, డిఏఓ శ్రీనివాసులు, కుడా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దర్గా నిర్మాణానికి సహకారం అందిస్తాం...

### – ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మాధవరం లో నిర్మిస్తున్న దర్గా నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆదోని రోడ్డు ప్రక్కన నూతనంగా నిర్మి స్తున్న గోఖర్ హుసని తాత నిర్మాణ కార్యక్రమాన్ని


దర్గా నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

చేప ట్టారు. ముందుగా దర్గా పెద్దలు ఎమ్మెల్యేను ఆహ్వానించి ప్రత్యేక ఫాతేహాలు నిర్వ హించి భూమి పూజ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దర్గా నిర్మాణానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సిపి మండల నాయకులు, మాజీ జెడ్పిటీసీ రాజశేఖర్ రెడ్డి, గోఖర్ హుసేని, దర్గా పీఠాధిపతి రహంతుల్లా, షాహపూర్ పీఠాధిపతి, ఫకృద్దీన్ ఖాద్రీ, వీరయ్య స్వామి, హనుమంతురెడ్డి, జగన్నాథ్,న కురువ జయరాం, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ని సవాళ్లు ఎదురైనా హామీలను అమలు చేసిన చంద్రబాబు- ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** ఆర్థిక పరంగా ఎన్ని సవాళ్లు ఎదురైనప్పటికీ సిఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల ఆశీర్వాదాలు పొందుతున్నారని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని నంద్యాల రోడ్డు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

నందు ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడిచిన ఏడాదిలో పారదర్శక పాలనలో సాధించిన ప్రగతి, అందించిన సంక్షేమంతో రాబోయే నాలుగేళ్లలో రాష్ట్ర అభివృద్ధి కోసం అమలు చేయాల్సిన ప్రణాళికలు, స్వర్ణాంధ్ర-2047లక్ష్యాలపై చర్చించడం జరిగిందన్నారు. సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు, ప్రజల జీవితాల్లో భద్రత, రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, అమరావతి, పోలవరం అభివృద్ధి కార్యక్రమాలన్నీ కూటమి ప్రభుత్వ పాలన విజయానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, కల్లూరు అర్బన్ కన్వినర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, మంచాలకట్ట శ్రీనివాసరెడ్డి, మైనార్టీ నాయకులు ఫిరోజ్, మాదేష్, కేతూరు మధు, మధు నాయక్, గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చౌడేశ్వరీ అమ్మవారికి పల్లకీసేవ

**బనగానపల్లెమేజర్,న్యూస్ :** శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి పల్లకి సేవను నందవరం గ్రామంలోని శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం నాడు వైభవంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం నాడు అమ్మవారి పల్లకి సేవను నిర్వహించడం ఆనవాయితి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో అలంకరించి వేద మంత్రోచ్చర నడుమ పల్లకిలో కూర్చొబెట్టి ప్రధాన ఆలయం చుట్టూ



పల్లకి సేవను నిర్వహించారు. ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మెగా ప్రాజెక్టు రావడం పట్ల హర్షం

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌లో రిలయన్స్ మెగా ప్రాజెక్టు రావడం పట్ల కర్నూలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వెనుకబాటుతనాన్ని దృష్టిలో ఉంచుకుని ఓర్వకల్లును ఇండస్ట్రీయల్ హబ్‌గా ప్రకటించడమే కాక అందు కనుగుణంగా పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రూ. 1,622కోట్లతో శీతల పానీయాల పరిశ్రమ ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతో 1200మందికి ఉద్యోగ అవకాశాలు ఏర్పడ్డాయని వివరించారు. ఈ పరిశ్రమలను తీసుకురావడానికి జిల్లా మంత్రి టీజీ భరత్ కృషి ఎంతో ఉందన్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్‌లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర కుమార్, సత్రం రామక్రిష్ణుడు, పెరపోగు రాజు, కాకర్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తెదేపా నాయకులు

# చిరుత పులి దాడిలో లేగదూడ మృతి

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానందిలోని అడవి ప్రాంతంలో చిరుత పులి హల్చల్ చేసింది. గురువారం సాయంత్రం మహానంది ఫారం గ్రామం సమీపంలోని శ్రీ వెంకటేశ్వర పశు పరిశోధన స్థానంలోని ఆవులను మేపేందుకు అడవిలోకి వెళ్లినప్పుడు ఆవుల గుంపుపై చిరుత పులి దాడి చేసిందని స్థానికులు తెలిపారు. ఈ చిరుత పులి దాడిలో లేగదూడ మృతి చెందిందని తెలిపారు. మృతి చెందిన లేగదూడకు అటవీ శాఖ అధికారులు ఆధ్వర్యంలో పశు వైద్యులు పంచనామా నిర్వహించారు. దీంతో గ్రామంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



# అనుమానంతో భార్యను చంపిన భర్త

### – కుటుంబ కలహాలే కారణం – బంధువుల ఫిర్యాదు

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** అనుమానమే భూతమై భార్యను భర్త కొట్టి చంపిన సంఘటన చోటు చేసుకొంది. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఉన్నాయి. సూగురు గ్రామానికి చెందిన బోయ హనుమంతు గుడికల్లుకు చెందిన లక్ష్మీదేవికి(45) గత 28సంవత్సరాల క్రితం వివాహమైంది. భార్యపై భర్తకు అనుమానం ఉండేది. భార్యను శారీరకంగా, మానసికంగా వేధించవాడన్నారు. తెల్లవారు జామున 3గంటలకు బోయ హనుమంతు భార్య లక్ష్మీదేవి మెడ, తలపైభాగంపై తోకతో బాదాడు. బలమైన గాయం తగలడంతో రక్తం కారుతుండగా కుమారుడు లేచి చూసి చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షంచగా, మృతి


మృతి చెందిన లక్ష్మీదేవి


భార్యను చంపిన భర్త

చెందినట్లు తెలిపారు. వీరిద్దరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# రీ సర్వే సమస్యలతో..
# రైతుల అష్ట కష్టాలు

- నిర్లక్ష్య సర్వేతో అధికమవుతున్న భూ సమస్యలు
- గ్రామ సర్వేయర్ల నిర్వాకానికి కార్యాలయం చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- పథకాలు కోల్పోతున్నామని సామాన్య ప్రజలు, రైతులు అసహనం
- జిల్లాలోనే బండి ఆత్మకూరు మండలంలో అత్యధిక జాయింట్ ఎల్పిఎంలు నమోదు



**బండి ఆత్మకూరు రూరల్ ,మేజర్ న్యూస్ :** రైతులకు భూ సమస్యలు లేని రాష్ట్రంగా చేయాలని గత ప్రభుత్వం తీసుకు వచ్చిన రీ సర్వే పథకం ప్రస్తుతం బండి ఆత్మకూరు మండల రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశలు పడ్డా రైతులకు బండి ఆత్మకురు విలేజ్ సర్వేయర్ల రూపంలో చుక్కలు కనిపిస్తున్నాయని అధికారుల చుట్టూ తిరగలేక ,సమస్యలు పరిష్కారం కాక అవస్థలు పడుతున్నామని రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బండి ఆత్మకూరు మండలంలో 10 గ్రామాలలో భూముల రీ సర్వే పూర్తవగా జిల్లాలోనే అత్యధికంగా 2785 జా యింట్ ఎల్పీఎంలు విలేజ్ సర్వేయర్లు నమోదు చేశారంటే రైతుల భూ సమస్యల పరిస్థితి మండలంలో ఎంత మేరకు ఉందో, విలేజ్ సర్వేయర్లు రీ సర్వే ఎంత నిర్లక్ష్యంగా చేపట్టారు అర్థమవుతున్నది. రైతుల సమక్షంలో భూముల రీ సర్వే చేయకుండా, రైతుల రికార్డులను పరిశీలించకుండా విలేజ్ సర్వేయర్లు ఇష్టానుసారంగా వ్యవహరించడంతో భూ సమస్యలు అధికమయ్యా యని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతుల భూములు ఆన్లైన్ నందు అధికంగా నమోదవడంతో తల్లికి వందనం వ ధ౯ కా ని కి అనర్హులుగా మారామని, మరి కొంతమందికి బ్యాంకు నందు క్రాప్ లోన్ ,గోల్డ్ లోన్ ఇవ్వడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇనాం భూముల విషయంలో జిల్లా స్థాయి అధికారులు చర్యలతో కొంతవరకు సమస్యలు పరిష్కారమైన, జాయింట్ ఎల్పీఎంల విష యంలో జిల్లా ,డివిజన్ సర్వే శాఖ కు చెందిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతుల సమ స్యలు సమస్యలుగానే మిగిలిపోతు న్నాయి. ఈనెల 30 తేదీ వరకు పరి ష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికీ మండలంలో ఆ దిశగా సమస్యలు పరిష్కారం అయ్యేలాగా కనిపించడం లేదని పరిస్థితిని సమీక్షించా ల్సిన జిల్లా సర్వే అధికారులు పట్టించుకోవడంతో సమస్యలు అలాగే ఉన్నాయని నంద్యాల జిల్లా కలెక్టర్ బండి ఆత్మకూరు మండలంపై ప్రత్యేక చొరవ తీసుకొని సంబంధిత సర్వే అధికారుల ద్వారా జాయింట్ ఎల్పిఎం సమస్యలను పరిష్కరించాలని రైతులు సామాన్య ప్రజలు వేడుకుంటున్నారు.

**నా పేరు మీద 32 ఎకరాలు**

**తల్లికి వందనం పోయింది**

**నెరవాటి శ్రీనివాసులు, రైతు**

నాకు భోజనం గ్రామ పొలిమేరలో 1.40 విస్తీర్ణం మాత్రమే భూమి కలదు. విలేజ్ సర్వేయర్ చేసిన ని ర్వాహకానికి నా పేరు మీద 32 ఎకరాలు ఆన్లైన్ నందు నమోదు కావడంతో ఇంటర్ చదువుతున్న నా చిన్న కుమారుడు తల్లికి వందన పథకం నిధు లు మాకు జమా కాలేదు. ఇప్పుడు సమస్య పరిష్కారం కోసం వస్తే సర్వేయర్లు లు సమ్మెలో ఉండ టంతో ఏమి చేయాలో తెలియని అయోమయ పరిస్థితి.

**జిల్లా సర్వే అధికారులు చొరవ చూపాలి**



**వల్లపురెడ్డి గంగాధర్ రెడ్డి సమాచార హక్కు చట్టం జిల్లా ఉపాధ్యక్షుడు**

బండి ఆత్మకూరు మండలంలో విలేజ్ సర్వేయర్ల నిర్లక్ష్యంతో దాదాపు 2800 ఎల్పిఎం నెంబర్లు నమోదు చేశారు. దీనివల్ల సామాన్య ప్రజలు రైతులకు భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. జిల్లా సర్వే అధికారులు చొరవ తీసుకొని ప్రజల సమస్యలు పరిష్కారం చేయడంలో కృషి చేయాలి.

## హరినామముతో పాపాలుహరించును

- డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే
- ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు



మిడుతూరులో శ్రీకృష్ణ ఆలయంలో గోపూజ మరియు ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

**మిడుతూరు మేజర్ న్యూస్ :** మిత్రులు మండల కేంద్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సి వేణుగోపాలస్వామి ఆలయంలో ధార్మిక కార్యక్రమాలు తిరుమల తిరుపతి దేవస్థానం మల్లు వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు అనంతరం వారు మాట్లాడుతూభగవన్నామము సకల పాపముల నుండి విముక్తిని కలిగించి, ఉత్తమ గతులను ప్రాప్తింప చేస్తుందని, ఎన్నో జప, తప, హోమాదికాలు చేసినంతటి పుణ్యఫలం ఈ యుగంలో కేవలం భగవన్నామ స్మరణకే కలుగుతుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిం దూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. శ్రీకృష్ణ మందిరం నందు గత నాలుగు రోజులుగా జరు గుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు భాగవతంలోని అజామిళోపాఖ్యానంపై ప్రవచించారు. అంతకు ముందు మూడు రోజులు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై డోన్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి డాక్టర్ తొగట సురేశ్ బాబు చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను తన్మయ పరచినవి. ఈ కార్యక్రమంలో ధర్మప్రచారకులు చెంచు రామ్మోహన్ రావు, భజన మండలి అధ్యక్షులు బన్నూరు రామకృష్ణారెడ్డి, దాలు చిట్టిబాబు, బన్నూరు శ్రీనివాస్ రెడ్డి, భజన నారాయణ, కె. మదన మోహనాచారి, అర్చకులు అన్నమరాజు వెంకట్రామయ్య, మధు, సంపంగి వెంకటేశ్వర్లు, జనార్దన్ యాదవ్, జె. వెంకటేశ్వర్లు శివ, నాగ సుబ్బుడు, భజన మండలి సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఆస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధికి కృషి చేయండి

**– నీతి అయోగ్ సిఈఓ బివిఆర్ సుబ్రమణ్యం**



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సిఈఓ బివిఆర్ సుబ్రమణ్యం

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** జిల్లాలో గుర్తించబడిన ఆస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధికి కృషి చేయాలని నీతి అయోగ్ సిఈఓ బివిఆర్ సుబ్రమణ్యం అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఢిల్లీ నీతి అయోగ్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నీతి అయోగ్ సిఈఓ బివిఆర్ సుబ్రమణ్యం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఈఓ మాట్లాడుతూ దేశంలో గుర్తించిన 329జిల్లాల్లోని 500ఆస్పిరేషనల్ బ్లాక్‌లను జిల్లా కలెక్టర్లు అభివృద్ధి చేయాలని ఆదేశించారు. వ్యవసాయం, విద్య, నీటి సౌకర్యాలు, స్కిల్ డెవలప్‌మెంట్, పోషకాహారం అందించడం, అంగన్‌వాడి కేంద్రాలు మొదలగు వాటిని వెంటనే అభివృద్ధి చేయాలని ఆదేశించారు. గుర్తించబడిన బ్లాక్‌లలో అన్ని మౌలిక సౌకర్యాలు సంతృప్తికరంగా కల్పించే చర్యలు తీసుకోవాలని వాటికి అవసరమైన నిధులు సమకూరుస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆస్పిరేషన్ జిల్లాల డెల్టా ర్యాంకును ప్రకటించారు. భవిష్యత్తులో నెలవారి మరియు త్రైమాసిక ర్యాంకులు, అవార్డులు ప్రకటిస్తామని ఇందులో రూ. 2.5కోట్లు, రూ. 3కోట్ల విలువైన ప్రోత్సాహకాలు ఉంటాయని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఆస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు వచ్చేలా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి సిపిఓ హిమ ప్రభాకర్ రాజు, హౌసింగ్ పిడి చిరంజీవి, డిఆర్‌డిఏ పిడి రమణారెడ్డి, జెడి అగ్రికల్చర్ వరలక్ష్మి, పశుసంవర్ధక శాఖ జెడి శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డిఈఓ శామ్యూల్‌పాల్, డిప్యూటీ డిఎంహెచ్ఓ భాస్కర్, ఐసిడిఎస్ పిడి నిర్మల, డిడి గ్రౌండ్ వాటర్ శ్రీనివాసరావు, జిల్లా అస్పిరేషనల్ బ్లాక్స్ మండల కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళండి –ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అందించిన ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గిత్త జయసూర్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మండలంలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారని అన్నారు. పార్టీ ఆదేశాల మేరకు కార్యకర్తలతో చర్చించి పార్టీ అభివృద్ధి కోసం కింది స్థాయి నుంచి కలిసి వచ్చి బలోపేతం చేయాలని అన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీ విజయకేతనం ఎగుర వేయాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికే ఉచిత గ్యాస్ పథకం, తల్లికి వందనం వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రతి రైతుకు ఆర్థిక సహాయం అందించనున్నదని అన్నారు. ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను జులై 2 నుంచి ఇంటింటికి తీసుకెళ్ళాలని అన్నారు. గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పార్టీ ఆదేశిస్తే ప్రతి కార్యకర్త పాటించాలని అన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్ట నున్నట్లు తెలిపారు. మండలంలో అన్ని గ్రామాలకు ఎన్నడూ లేని విధంగా సీసీ రహదారులకు నిధులు మంజూరు చేయించడం జరిగిం దని అన్నారు. మండలంలో ఉన్న శివపురం,సంగమేశ్వర ఎత్తిపోతల పథకం సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండలాన్ని అభివృద్ధి చేసేందుకు మరిన్ని చర్యలు చేపట్టతామని వివరించారు. మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడ్, మాజీ కన్వీనర్లు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సర్పం చ్ చంద్రశేఖర్ యాదవ్, మోహన్‌యాదవ్, మల్లాం ౼డ్డి, జహరుల్లా, నాగేశ్వరయాదవ్, లింగన్న, అమర్‌నాథ్ యాద వ్, స్వామిరెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన టీడీపీ లీగల్ సెల్ నాయకులు

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** నంద్యాల మూడవ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు అడ ిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా నంద్యాల నియోజకవర్గం మిట్నాల గ్రామానికి చెందిన నంద్యాల జిల్లా టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు అడ్వకేట్ శీలం నాగ రాజేశ్వరరెడ్డిని నియమించినందుకు మంత్రిని టీడీపీ లీగల్ సెల్ నాయకులు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఏపీ రాష్ట్ర న్యాయ



మంత్రిని సన్మానిస్తున్న లీగల్ సెల్ నాయకులు

శాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను, టీడీపీ రాష్ట్ర యువ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్‌లను ఏపీపీ నాగ రాజేశ్వం ౕరెడ్డి, నంద్యాల లీగల్ సెల్ సభ్యులు టీడీపీ కార్యాలయం (రాజ్ టాకీస్)లో ప్రత్యేకంగా కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ టీడీపీ లీగల్ సెల్‌స్టేట్ సెక్రటరీ పీడీహెచ్‌బాబు, చాబోలు ఇలియాస్, అస్మద్దీన్, నంద్యాల జిల్లా టీడీపీ లీగల్ సెల్ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, నంద్యాల బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు గొల్ల జయకృష్ణ, ప్రతాప్‌రెడ్డి, అడ్డగాల్ల వెంకటేశ్వర్లు, భూమా వెంకటరెడ్డి, వెంకటేశ్వరరావు, రఘుప్రకాష్, ఎస్ఐ ఖలీల్, సాయి రాం, తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో మహిళలను గౌరవించాలి.. డీఎస్పీ


**- వడ్డెమాన్ అవగాహన సదస్సులో పాల్గొన్న ఆత్మకూరు డీఎస్పీ**



**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్ :** ప్రస్తుత సమాజంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలను గౌరవించాల్సిన బాధ్యత అందరి పైన ఉందని ఆత్మకూరు డీఎస్పీ రామంజీ నాయక్ ప్రజలకు సూచించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు నేరాలపై నంద్యాల జిల్లా ఎస్ పి అధిరాజ్ సింగ్ రాణా, ఆదేశాల మేరకు ఆత్మకూరు డీఎస్పీ రామంజీ నాయక్నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బ్రాహ్మణకొట్కూరు ఎస్సై పూజారి తిరుపాల్ శుక్రవారం మండల పరిధిలోని వడ్డెమాన్ గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత నగదు కోసం దొంగతనాలు, చైన్ స్నాచర్, చెడు అలవాట్లకు గురై తప్పుదారి పడుతున్నారని వారిని సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. గ్రామాలలో అలజడులు సృష్టిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అన్ని నియోజకవర్గాల కన్నా నందికొట్కూరు నియోజవర్గం కుల మతాలకు అతీతంగా భిన్నమైనదన్నారు.మద్యం సేవించి ఎవరు వాహనాలు నడపరాదని, ద్విచక్రవాహనంపై వెళ్లే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని సూచించారు. గ్రామంలో ఎవరు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు అతివేగంగా నడుపుతూ, రోడ్డుప్రమాదాలకు గురవుతున్నారన్నారు. మద్యం సేవించి ఎవరు వాహనాలు నడపరాదని కుటుంబంలో ఒక వ్యక్తికి ఏదైనా ప్రమాదంజరిగికోల్పోతే ఆ బాధ ఎవరు భరించలేనిదన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు జాగ్రత్తగా వారి కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని వాహనాలు నడపాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని , త్రీ వీలర్ , ఇతర వాహనాలు నడిపే వారు మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్టా సత్యంరెడ్డి, గ్రామ సర్పంచ్ రామచంద్రుడు ,పోలీస్ సిబ్బంది వెంకటేశ్వర్లు, చెన్నయ్య, గ్రామ ప్రజలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పత్తికొండ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్‌కు ఘనంగా సన్మానం

**కృష్ణగిరి, మేజర్‌న్యూస్ :** పత్తికొండ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్‌గా ఆలంకొండ ఎస్ కె నబీసాహెబ్ కు కృష్ణగిరి మండల పరిషత్, ఉపాధి కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. అలాగే మండల తేదేపా అధ్యక్షులు కటార్‌కొండ మర్రి శ్రీరాములను వారు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఛైర్మెన్ ఎస్ కే నబీ సాహెబ్ మట్లాడుతూ మాజీ ఉప ముఖ్యమంత్రి కేఇ కృష్ణమార్తి ఆశీస్సులతో పత్తికొండ ఎమ్మెల్యే కేఇ శాంబాబు ప్రోత్సహంతో తనకు ఈ పదవి వరించిందని ఆయన పేర్కొన్నారు. కృష్ణగిరి మండల పరిషత్ కార్యలయ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జి. మోహన్ కుమార్, ఎఓ రామస్వామి, ఇఓఆర్‌డి మంజుల, ఎపిఓ నాగసులోచన, ఎపిడి పద్మావతి. నాయకులు బోయబొంతి రాళ్ళ



రఫి సాహెబ్, మదాపురం యు. గురు స్వామి, పోతుగల్లు సాగునీటి సంఘం అధ్యక్షులు ఇ. సోమలింగన్న గౌడ్, పలు గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

# ఎస్సీ,ఎస్టీ కేసులో జయంతి వెంకటేశ్వర్లు అరెస్టు,రిమాండ్

(మొదటిపేజి తరువాయి..)

షరాఫ్ బజార్‌లోని ఓ బంగారు షాపు యజమాని శరత్ చంద్ర అనే వ్యక్తి కూడా చీటీ లో సభ్యుడిగా ఉన్నాడు. అతను చీటీ డబ్బులు కట్టినా కట్టలేదని జయంతి వెంకటేశ్వర్లు గత నెల గొడవకు దిగడంతో శరత్ చంద్రకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే శరత్ చంద్ర 2వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే నాలుగు రోజుల క్రితం టుటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్ వద్ద శరత్ చంద్ర అతని స్నేహితుడు, విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు జూటూరు రవిలు ఇద్దరు వెళుతుండగా ఎదురుపడిన జయంతి వెంకటేశ్వర్లు శరత్ చంద్రపై దాడి చేసి అతని జేబులో ఉన్న రూ.20వేల నగదును లాక్కొని వెళుతుండగా ఎందుకు గొడవ పడుతున్నారని జూటూరు రవి అడ్డుపడగా జూటూరు రవిని జయంతి వెంకటేశ్వర్లు కులం పేరుతో దూషించడంతో 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో జూటూరు రవి ఫిర్యాదు చేశారు. దీంతో రెండు కేసులను విచారణ చేసిన పోలీసులు గురువారం జయంతి వెంకటేశ్వర్లుపై ఎస్సి, ఎస్‌టి కేసు, దాడి, చీటింగ్ కేసులు నమోదు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టుటౌన్ పోలీసులు తెలిపారు.

# ప్రతి ఎకరానికి సాగునీరు అందించాలి

**మండల సమావేశంలో సభ్యుల వెల్లడి..**

**కృష్ణగిరి, మేజర్‌న్యూస్ :** హంద్రీ నీవా కింద ప్రతి ఎకరానికి సాగునీ రు అందేలా ఇరిగేషన్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని చిట్యాల సర్పంచు ఇ. రాజేశ్వర గౌడ్, ఎరకలచెరువు సర్పంచు బి.ప్రవీణ్, కటార్ కొండ సర్పంచు నక్కి లెనిన్ బాబు, బోయ బొంతి రాళ్ళ సర్పంచు జె.రవి మోహన్ అన్నారు. మండల పరిషత్ కార్యాల య సమావేశ భవనంలో ఎంపిడిపి డాక్టర్ కంగాటి వెంకట్రామి రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ




ప్రతి ఎకరానికి సాగు నీటితో పాటు త్రాగు నీటిని అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇరిగేషన్ శాఖ అధికారులు సమావేశానికి గైర్హాజరైయ్యారు. పత్తికొండ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ ఎస్ కె.నబీసాహెబ్ మాట్లడుతూ కృష్ణగిరి మండలం లో హంద్రీ నీవా కింద 8 ప్రాంతాలలో స్లూయిస్ గేట్లుకు ప్రభుత్వ అనుమతి వచ్చిన వెంటనే పనులు చెపడతామని ఆయన తెలిపారు. ఇంకా పలు సమస్యల పై అధికారులను నిలదీసి సంబంధిత సభ్యులు అడిగారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జి. మోహన్ కుమార్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎఇ కె.హరినాథ్, పిఆర్‌ఎఇ జాకీర్ ఉశ్సేన్, అగ్రికల్చర్ ఎఓ కె.మహేంద్ర, రీసర్వే డిటి దీపిక, ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుగుణమ్మ, ఎపిఎం మహేష్, అమకతాడు సర్పంచు బోయ సర్వేశ్వరి, ఆలంకొండ సర్పంచు షేక్ షహనాబేగం ఇంకా పలువురు అధికారులు, ఎమ్పీటిసీ సభ్యులు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

# చిన్న నారాయణ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**చాగలమర్రి ,మేజర్ న్యూస్ :**

చాగలమర్రి మండల పరిధిలోని గోడిగనూరు గ్రామంలో ఎంపీటీసీ జిల్లా పార్టీ కార్యదర్శి పత్తి నారాయణ సోదరుడు పత్తి చిన్న నారాయణ ఆకస్మికంగా మృతి చెందడం జరిగింది. శుక్రవారం ఆళ్లగడ్డ మాజీ శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి చిన్న నారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. అనంతరం ఎంపీటీసీ పత్తి నారాయణతొ చిన్న మరణించిన విషయాలను తెలుసుకున్నారు. అధైర్య పడకండి, తాము అండగా ఉంటామని తెలిపారు. ఈయన వెంటదామోదర్ రెడ్డి వైఎస్ఆర్సిపి రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి చుండూరు వెంకటరమణ, జిల్లా పార్టీ ప్రచార కార్యదర్శి గణేష్ రెడ్డి, మండల పార్టీ నాయకులు శెశు రమేష్ నాన్న బాల సంజీవరాయుడు, సర్పంచ్ చీపాటి సంజీవరాయుడు, కృష్ణ, తులసి నానుబాల వెంకటేశ్వర్లు, గంగయ్య కుటుంబ సభ్యులు ఉన్నారు.

# మిడుతూరు టిడిపి ఎన్నికల అబ్జర్వర్ గా జి.నాగముని



**మిడుతూరు మేజర్ న్యూస్ :** నందికొట్కూర్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణకు సన్నాహాలుజరుగుతున్నాయి.నియోజకవర్గం, మండలస్థాయి కమిటీల ఏర్పాటుకు పార్టీ అధిష్ఠానం చర్యలు చేపట్టింది. కొత్తవారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. సంస్థాగత ఎన్నికల నిర్వహణ కోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక రెగ్యులర్ అబ్జర్వర్ ఒకరు, ఇద్దరు ఎలక్షన్ అబ్జర్వర్లను నియమించింది. మిడుతూరు మండలనికి ఎన్నికల అబ్జర్వర్ గాలాయర్ జి.నాగమునినియమితులయ్యారు.అలాగే పత్తికొండ నియోజకవర్గానికి రెగ్యులర్ అబ్జర్వర్‌గా రాష్ట్ర యాదవ సంఘం డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్ ఎలక్షన్ అబ్జర్వర్లుగా నియమితులయ్యారు వీరిద్దరిని నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య ప్రత్యేకంగా అభినందించారు.

# త్రిబుల్‌ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులు

**అభినందించిన పాఠశాల ఉపాధ్యాయులు**

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణం లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు త్రిబుల్ ఐటీ లోసీట్లు సాధించారు. వివరాల్లోకి వెళితే మార్చి 2025లో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు షేక్ షాదియా 524, బి నమ్రత 575,షేక్‌సుమయ568 మార్కులు సాధించి ప్రతిభను చాటారు. దీంతోపాటు ఇడుపులపాయ త్రిబుల్ ఐటీ లో ముగ్గురు సీట్లు సాధించి పాఠశాల గౌరవాన్ని, ఖ్యాతిని ఇనుమడింప చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులుఫర్హత్ నసీమ్ తోపాటు ఉపాధ్యాయినిలు సీట్లు సాధించిన విద్యార్థినిలకు బహుమతితోపాటు వెయ్యి రూపాయల నగదు పురస్కారాన్ని అందించడం జరిగింది. ఉపాధ్యాయునిలు రాధిక, సంజమ్మ, విజయలక్ష్మి లు నగదు బహుమతిని అందించి విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు.



**విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం**

# మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు



**వాహనాలు తలుపు చేస్తున్న ఎస్ఐ సురేష్**

**చాగలమర్రి ,మేజర్ న్యూస్ :** చాగలమర్రి మండలంలో మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని చాగలమర్రి ఎస్సై సురేష్ తెలిపారు. శుక్రవారం చాగలమర్రి లోని శెట్టి వీడు వద్ద నాకాబంది చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మైనర్లు చిన్నపిల్లలు ద్విచక్ర వాహన నడపరాదని నడిపి పట్టబడితే తల్లిదండ్రులను పై చర్యలు ఉంటాయన్నారు.మొహరం పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి సిబ్బంది ఉన్నారు.

# గోనెగండ్లలో కొలువైన పీర్లు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన గోనెగండ్ల తో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున పీర్ల ఆయాగ్రామాల్లోని చామిడిలలో కొలువైనాయి. కులమతాలకు అతీతంగా గ్రామ పెద్దలు పీర్ల చావిడి దగ్గరకు వెళ్లి మేళతాళలతో ఘనంగా పీర్లను ప్రతిష్టించారు. దీంతో మోహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను మండల ప్రజలు కులమతాలకు అతీతంగా జరుపుకుంటారు. ఆయా గ్రామాల్లో ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఘర్షణలకు పాల్పడిన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నిబంధనల ప్రకారం ప్రార్ధనలు జరుపుకోవాలని సీఐ సూచించారు. జూలై 3న చిన్నసరిగెత్తు, 4న పగటి సరిగెత్తు. 5న పెద్దసరిగెత్తు, 6న మెహర్రం నిర్వహిస్తున్న ముజా వర్లు దరగలమాబు, ముల్ల రహీంబాషా తెలిపారు.



**గోనెగండ్ల లో కొలువైన పీర్ల దేవుళ్లు**

# తుగ్గలిలో మలేరియా మాసోత్సవాలు




**తుగ్గలి,మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన తుగ్గలిలో శుక్రవారం మలేరియ మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తుగ్గలి లోని వీధులు వీదులు తిరిగి డ్రై డే ను పాటించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సబ్ డివిజన్ మలేరియా అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంటూ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ శుభ్రత పరిశుభ్రతను పాటించాలన్నారు. పరిశుభ్రత పాటించకపోవడం వల్ల అంటూ వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. అందుకు ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమల కాటు నుండి తప్పించుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ సరస్వతి, సూపర్వైజర్ నాగమ్మ , ఆరోగ్య కార్యదర్శి మహాలక్ష్మి ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అనంతరము వీధుల్లో ఉన్న డ్రమ్ములను క్లీన్ చేయించారు. వారికి వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు.

# డియస్సీ టెట్ ప్రత్యేకం

# జాగ్రఫీ



## శ్వేత విప్లవం

- శ్వేత విప్లవం – పాల వెల్లువ లేదా 'ఆపరేషన్ ఫ్లడ్' ప్రాజెక్టుగా పిలుస్తారు.
- 1970లో నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు ప్రారంభించిన ప్రాజెక్టు
- పాల ఉత్పత్తిలో భారతదేశం ప్రపంచంలో ప్రథమస్థానంలో ఉన్నది.
- భారతదేశంలో శ్వేతవిప్లవానికి రూపశిల్పి మరియు పితామహుడు డాక్టర్ వర్గిస్ కురియన్
- వర్గిస్ కురియన్‌ను భారతదేశ పాల మనిషిగా (మిల్క్ మాన్ ఆఫ్ ఇండియా) గా పిలుస్తున్నారు.
- గుజరాత్‌లో ఆనంద్ జిల్లాను భారతదేశ పాల రాజధానిగా ప్రసిద్ధి చెందింది.
- ఇది అమూల్ త్రిమూర్తులు : త్రిభువందాస్ పటేల్, వర్గీస్ కురియన్ మరియు హెచ్‌ఎమ్ దలయ ద్వారా అమూల్ డెయిరీ మరియు దాని పాల విప్లవానికి ప్రసిద్ధి చెందింది.
- శ్వేతవిప్లవం 2.0 సెప్టెంబరు 19, 2024న పాలఉత్పత్తి పెంచడం, డెయిరీ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, సహకార సంఘాలను బలోపేతం చేయడం, పశువుల పెంపకాన్ని మెరుగుపరచడం కోసం ప్రారంభించారు.
- ఆపరేషన్ ఫ్లడ్ అనేది ప్రపంచంలోనే అతిపెద్ద సమగ్ర డెయిరీ అభివృద్ధి కార్యక్రమం.
- శ్వేతవిప్లవంను ఇరాన్‌లో 1963లో షా మహమ్మద్ రెజా పహ్లావి ప్రారంభించారు.
- డాక్టర్ వర్గిస్ కురియన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం నవంబరు 26ను జాతీయ పాల దినోత్సవంగా జరుపుకుంటారు.
- పశ్చిమ బెంగాల్‌లోని ఇచ్ఛమతి సహకార పాల సంఘం మరియు తెలంగాణలోని ములకనూరు మహిళా పరస్పర సహాయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు అనేవి మహిళలచే నిర్వహించబడుతున్నాయి.

### శ్వేత విప్లవం – ప్రాక్టీస్ బిట్స్

**1. శ్వేత విప్లవ పితామహుడు ఎవరు?**
1. నార్మన్ బోర్లిగ్
2. హరిలాల్ చౌదరి
3. వర్గిస్ కురియన్
4. ఎమ్.ఎస్. స్వామినాథన్



**2. శ్వేత విప్లవానికి ఉద్దేశించినది ఏది?**
ఎ. వెన్న    బి. నెయ్యి
సి. జున్ను
1. ఎ మరియు బి    2. బి మరియు సి
3. ఎ,బి మరియు సి    4. ఎ మరియు సి

**3. క్రింది వానిలో శ్వేత విప్లవం 2.0లోని అంశాలు ఏవి?**
ఎ. ప్రతి రాష్ట్రంలో రాష్ట్రస్థాయి యూనియన్ ఏర్పాటు చేయడం
బి. పాల సంఘాలను ఏర్పాటు చేయడం
సి. స్థిరత్వం (పాడి రంగంలో)
డి. పాడి రంగంలో వృత్తికారత
1. ఎ మరియు బి    2. బి మరియు సి
3. ఎ,బి మరియు సి    4. ఎ,బి,సి మరియు డి

**4. ఆపరేషన్ ఫ్లడ్ కార్యక్రమం దేనికి ఉద్దేశించినది?**
ఎ. పాలు    బి. వెన్న
సి. నెయ్యి    డి. జున్ను
1. ఎ మరియు బి    2. బి మరియు సి 3 .
ఎ,బి మరియు సి    4. ఎ,బి,సి మరియు డి

**5. ఆపరేషన్ ఫ్లడ్ అనే కార్యక్రమం ఎపుడు ప్రారంభం అయినది?**
1. 1970    2. 1965
3. 1966    4. 2005

**6. ప్రపంచ పాల ఉత్పత్తిలో భారతదేశం ఎన్నవ స్థానంలో ఉన్నది?**
1. 1వ    2. 2వ
3. 3వ    4. 4వ

**7. భారతదేశం యొక్క పాల రాజధాని అని దేనిని పిలుస్తారు?**
1. గాంధీనగర్ – గుజరాత్    2. ఆనంద్ – గుజరాత్
3. పోరుబందర్ – గుజరాత్    4. అహ్మదాబాద్ – గుజరాత్

**8. పాల ఉత్పత్తిలో వరుసక్రమంలో ఉన్న రాష్ట్రాలను గుర్తించండి?**
1. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్
2. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్
3. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్
4. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్

**9. శ్వేతవిప్లవం 2.0 ఎప్పుడు ప్రారంభించారు?**
1. సెప్టెంబరు 18, 1970
2. సెప్టెంబరు 19, 1980
3. సెప్టెంబరు 18, 2024
4. సెప్టెంబరు 19, 2024

**10. భారతదేశ పాల మనిషి అని ఎవరిని పిలుస్తారు?**
1. వర్గిస్ కురియన్    2. ఎమ్.ఎస్. స్వామినాథన్
3. హరిలాల్ చౌదరి    4. బి.వి. రావు

**11. భారతదేశంలోని అతిపెద్ద పాల సహకార సంస్థ ఏది?**
1. మిల్మా – కేరళ    2. అమూల్ – గుజరాత్
3. నందిని – కర్ణాటక    4. ఆవిన్ – తమిళనాడు

**జవాబులు :**
1)2, 2)3, 3)4, 4)4, 5)1, 6)1, 7)2, 8)3, 9)4, 10)1, 11)2



పాదం సుధాకర్
ఫ్యాకల్టీ

# SSC, RRB, PSC Police, Bank Exams

# REASONING Mising Numbers

Q. Find the missing number

1
3 (510) 5
4

3
2 (650) 4
6

1
0 (?) 2
8

A. 670    B. 690
C. 680    D. 685
Ans. : (B) 690
Explanation : From the above circles, Square the four values
$=1^2+3^2+4^2+5^2$
$=1+9+16+25=51$
Multiply with 10 --> 51X10=510.
That is Circles middle value.
Similarly
$2^2+3^2+4^2+6^2 = 4+9+16+36=65$
Multiply with 10, we get 65x10=650
Third Circle Value
$0^2+1^2+2^2+8^2=0+1+4+64=69x10=690$

Q. 17,25,150,662, 1993, 4737, ?
A. 8990    B. 9170
C. 7370    D. 8620
E. 9650
Ans. : E
Explanation :
$17+2^3=17+2x2x2=17+8=25$
$25+5^3=25+5x5x5=25+125=150$
$150+8^3=150+8x8x8=150+512=662$
$662+11^3=662+11x11x11$
$=662+1331=1993$
$1993+14^3=1993+14x14x14$
$=1993+2744=4737$
$4737+17^3=4737+4913=9650$

Q. Find the missing number in the given series :
24, 24, 36, 72, 180
A. 280    B. 480
C. 360    D. 540    E. 320
Ans. : (D); 540
Explanation :
24x1=24
24x1.5=36
36x2=72
72x2.5=180
180x3=540 is missing number.

Q. From the given series find the missing number.
44, 72, 104, 140, 180, ?
A) 210    B) 205
C) 315    D) 224
Ans. : D) 224
Explanation :
4x11=44
6x12=72
8x13=104
10x14=140
12x15=180
14x16=224 is missing number.

Q. 12, 54, 84, 104, 116, 122, ?
A) 124    B) 127    C) 128
D) 120    E) None of these.
Ans. : (A) 124
Explanation :
$12+7^2-7=12+7x7-7=12+49-7=54$
$54+6^2-6=54+6x6-6$
$=54+36-6=54+36-6=54+30=84.$
$84+5^2-5=84+25-5=84+20=104$
$104+4^2-4=104+16-4=104+12=116$
$116+3^2-3=116+9-3=116+6=122$
$122+2^2-2=122+4-2=122+2=124$

Q. 378, 297, 233, 184, 148. From the given series, find the missing number :
A) 121    B) 120    C) 123
D) 122    E) 125
Ans : (C) 123
Explanation :
$378-9^2=378-81=297$
$297-8^2=297-64=233$
$233-7^2=233-49=184$
$184-6^2=184-36=148$
$148-5^2=148-25=123$ is the missing number.

Q. Find the missing number :
2, 17, 121, 729, ?, 14601
A) 3649    B) 3278    C) 3962
D) 3783    E) 3564
A) 3649
Explanation :
2x8+1=16+1=17
17x7+2=119+2=121
121x6+3 = 726+3=729
729x5+4=3645+4=3649
3649x4+5=14596+5=14601

Q. 52, 274, 404, 472, 502, ?
A) 517    B) 522    C) 512
D) 532    E) 412
Ans. : (C) 512
Explanation :
$52+6^3+6=52+216+6=274$
$274+5^3+5=274+125+5=404$
$404+4^3+4=404+64+4=472$
$472+3^3+3=472+27+3=502$
$502+2^3+2=502+8+2$
=512 is missing number.

Dr. M.Reddi Ramu,
Professor, Viswam Engineering College (Autonomous), Madanapalli



# పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు.

- ఎంపీ డా. బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి
- సిమెంట్ నగర్ గ్రామంలో ఘన స్వాగతం





**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** బేతంచర్ల మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో గల పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల స్థానికులకు ఉపాధి,ఉద్యోగ అవకాశాలు లభిస్థాయని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూరప్రకాష్ రెడ్డిలు అన్నారు.శుక్రవారం పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ పునఃప్రారంభోత్సవం నిర్వహిం చారు.ముందుగా గ్రామం గల పాతబస్టాండ్ టిడిపి నాయకులు కార్యకర్తలు, ఫ్యాక్టరీ కార్మికులు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఫ్యాక్టరీ ఆవరణంలో ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ ఎన్నికల ముందు కార్మికులు గత వైసిపి ప్రభుత్వంలో ఫ్యాక్టరీ ఉద్యోగులను తీసివేసి కేవలం వైసిపి కండువా వేసుకున్న వారికే ఉద్యోగ అవకాశాలు కల్పించారని ,పర్మినెంట్ ఉద్యోగుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తూ పోలీసులతో బెదిరింపులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేయగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చామని అన్నారు. హామీ మేరకు రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ చొరవతో పాణ్యం సిమెంట్ పరిశ్రమ పునఃప్రా రంభం అయిందని, ఈ పరిశ్రమ వల్ల స్థానిక యు వతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు.

బిసి రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు కిట్లు పంపిణీ : బేతంచెర్ల మండల పరిధిలోని గోరుమానుకొండ సమీపాన గల మహాత్మ జ్యోతి రావు పూలే బిసి రెసిడెన్షియల్ స్కూల్లో ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి డా.సర్వేపల్లి రాధా కృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులకు అంద చేశారు.వారు మాట్లా డుతూ విద్యార్థుల భవిష్యత్ కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడు తుందని వాటిని సద్వినియోగం చేసుకొవలన్నారు. బాగా చదివి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని అన్నారు.

# నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలి

– ఈవిఎం గోడౌన్ తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



ఆయా పార్టీల ప్రతినిధులతో కలిసి గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ఈవిఎంలను భద్రపరిచిన గోదాము వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు త్రైమాసిక తనిఖీలో భాగంగా కలెక్టరేట్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఈవీఎం యంత్రాలు, అక్కడి భద్రతా చర్యలను కలెక్టర్ క్షణ్ణంగా పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి, రాజకీయ పార్టీ ప్రతినిధులు, బిజెపి తరపున సాయి ప్రదీప్, జనసేన పార్టీ తరపున మంజునాథ్, సమాజ్ వాది పార్టీ డిస్టిక్ ఇంచార్జ్ అరుణ్ కుమార్, తెదేపా తరపున తెలుగు యువత వైస్ ప్రెసిడెంట్ పి రాజు, కాంగ్రెస్ పార్టీ తరుపున బజారన్న పాల్గొన్నారు.

# నేర నియంత్రణ, ప్రజలకు ఉత్తమ సేవలందించడమే లక్ష్యం

- మహిళలపై నేరాల నివారణకు గట్టి చర్యలు చేపట్టాలి
- కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



ప్రశంసపత్రాలు అందచేస్తున్న ఎస్పీ

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజలకు ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలతో ఎస్పీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా రాత్రి గస్తీలు బాగా చేయాలన్నారు. అనుమానస్పదంగా కనిపించే వ్యక్తుల వేలిముద్రలను సేకరించి వాటిని నేర రికార్డులతో సరిపోల్చి నేరగాళ్లను పట్టుకోవాలన్నారు. ఫోక్సో కేసుల్లో నివేదికలు త్వరగా సిద్ధం చేయాలన్నారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు డివిజన్‌లలో ఉన్న పెండింగ్ కేసుల గురించి సమీక్షించి ఆరాతీశారు. అనంతరం వివిధ కేసులలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసపత్రాలు అందచేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డిఎస్పీలు బాబు ప్రసాద్, వెంకట్రామయ్య, ఉపేంద్రబాబు, హేమలత, ఏఆర్‌డిఎస్ భాస్కర్ రావు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.







## ప్రజా సమస్యల పరిష్కారమే

# కూటమి ప్రభుత్వ ధ్యేయం..

- ప్రజాదర్బార్‌లో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి



**బనగానపల్లె,మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం నుంచి బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ సమస్యలను మంత్రికి వివరించి ఆయా సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా అమలు చేయిస్తున్నారని, దీంతో తామంతా క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. తక్షణమే ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు నుంచి వచ్చిన అర్జీలపై తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

## గని గ్రామ పొలాల సమీపంలో

# చిరుత పులి కలకలం

- పంట పొలాలలో చిరుత పులి కలకలం..
- భయంతో రైతులు మరియు గొర్రెలు మేపుకునే నిర్వాహకులు..

**గడివేముల మేజర్ న్యూస్ :** గడివేముల మండలంలోని గని గ్రామ సమీపంలోని దాదాపు 6 కిలోమీటర్ల దూరంలో మొల్ల లా మామిడి తోట సమీపాన పంట పొలాలలో గని గ్రామానికి చెందిన రైతు గౌండనబి పొలం పరిసరాలలో రెండు చిరుత పులులు కనబడడంతో రైతు భయంతో పరుగు తీశారు. చుట్టుపక్కల గొర్రెలు వేపుకునే నిర్వాహకులకు ఈ విషయాన్ని తెలపడంతో గొర్రెలు మేపుకునే నిర్వాకుడు చిరుత పులులను తన సెల్ ఫోన్ లో ఫోటో తీసుకొని గ్రామ సర్పంచ్ తులసమ్మకు ఈ విషయాన్ని తెలిపారు. గ్రామ సర్పంచి తులసమ్మ విషయాన్నీ ఫారెస్ట్ అధికారులకు చేరదీశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తులసమ్మ మాట్లాడుతూ రైతులు మరియు గొర్రెల నిర్వాహకు లు జాగ్రత్తగా ఉండాలని ఏమైనా చిరుతపులులు కనబడితే వెంటనే ఫారెస్ట్ అధికారులు తెలియజేయాలని తెలిపారు. చిరుత పులులు సంచరించే ప్రదేశాలలో వెళ్ళవద్దని రైతులకు మరియు గొర్రెలు మేపుకునే నిర్వాహకులకు తెలిపారు.



